సాక్షి
మహబూబ్‌నగర్
ఆదివారం । 8 । జూన్ । 2025



ప్లాస్టిక్ రహితంగా..

ఫతేపూర్ మైసమ్మ అడవిని ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు చర్యలు చేపట్టారు.

వివరాలు 10లో ▸



మహిళలకు క్రికెట్ లీగ్

పాలమూరులో తొలిసారి ఇంట్రా డిస్ట్రిక్ట్ ఉమెన్స్ క్రికెట్ లీగ్ నిర్వహించనున్నారు.

వివరాలు 10లో ▸



వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మతసామరస్యాన్ని కాపాడుకోవాలి



మహబూబ్‌నగర్ క్రైం: బక్రీద్ పండగ సందర్భంగా శనివారం జిల్లాకేంద్రంలో ఉన్న ఈద్గాల దగ్గర ఎస్పీ డి.జానకి బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ముస్లింలు సామూహికంగా ప్రార్థనలు నిర్వహిస్తున్న సందర్భంలో అక్కడ ఏర్పాటు చేసిన పోలీస్ భద్రతను ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో శాంతి, సామరస్యం నిలుపుకోవడం అందరి బాధ్యత అని, వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. పోలీసులు ఎప్పుడూ కూడా ప్రజలతో స్నేహపూర్వకంగా ప్రవర్తించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐలు అప్పయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి

పాలమూరు: జోగుళాంబ గద్వాల జిల్లాలోని ఇథనాల్ కంపెనీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ చేసిన దీక్షల నేపథ్యంలో రైతులపై పెట్టిన కేసులు వెంటనే ఎత్తివేయాలని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దధన్వాడ గ్రామంలో ఇథనాల్ కంపెనీ ఏర్పాటు కోసం 2023లో అప్పటి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, కానీ, 12 గ్రామాల రైతులు, ప్రజలు కంపెనీ ఏర్పాటు చేయవద్దని కోరుతున్నారని చెప్పారు. సరైన న్యాయం కోసం శాంతియుతంగా దీక్షలు చేస్తున్నారన్నారు. ఇప్పటికే చిత్తనూర్‌లో ఇథనాల్ కంపెనీ వల్ల పెరిగిన కాలుష్య పరిస్థితిని అర్థం చేసుకుని కంపెనీ రద్దు చేయకపోతే తమ భవిష్యత్ కోల్పోవాల్సి వస్తోందని ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఓపెన్ స్కూల్ ఫలితాలు విడుదల

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత నెల మొదటి వారంలో జరిగిన ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలకు సంబంధించిన ఫలితాలను ప్రభుత్వం శనివారం విడుదల చేసింది. ఈ మేరకు మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించి 559 మంది విద్యార్థులు పరీక్ష రాయగా.. 374 మంది (67.09 శాతం) ఉత్తీర్ణులయ్యారు. అలాగే జోగుళాంబ గద్వాల జిల్లా పరిధిలో 455 మంది పరీక్ష రాయగా.. 255 మంది (52.43 శాతం), వనపర్తి జిల్లా పరిధిలో 346 మందికి గాను 289 (88.59 శాతం), నాగర్‌కర్నూల్ జిల్లాలో 353 మందికి గాను 235 (67.10 శాతం), నారాయణపేటలో 503 మంది పరీక్ష రాయగా.. 424 మంది (84.48 శాతం) ఉత్తీర్ణత నమోదు చేశారు.

■ ఇంటర్మీడియట్‌కు సంబంధించి మహబూబ్‌నగర్ జిల్లాలో 841 మంది పరీక్ష రాయగా.. 490 మంది (60.21 శాతం) ఉత్తీర్ణత సాధించారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో 652 మందికి గాను 412 (63.12 శాతం), వనపర్తి పరిధిలో 510 మందికి గాను 370 మంది (72.84 శాతం), నాగర్‌కర్నూల్‌లో 746 మందికి గాను 546 మంది (73.30 శాతం), నారాయణపేట జిల్లాలో 897 మందికి గాను 528 మంది (59.62 శాతం) నమోదు చేసినట్లు డీఈఓ ప్రవీణ్‌కుమార్, ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ శివయ్య పేర్కొన్నారు.

‘పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి’

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉపాధి హామీ కూలీలతోపాటు ఫీల్డ్ అసిస్టెంట్ల (ఎఫ్‌ఏ)కు వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ అన్నారు. శనివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూలీలకు తొమ్మిది వారాల నుంచి, ఎఫ్‌ఏలకు మూడు నెలల నుంచి వేతనాలు అందడం లేదన్నారు. ఈ విషయమై గత నెల 30న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా ఉపాధి కూలీలకు రోజుకు రూ.600, పని దినాలు 200 రోజులకు పెంచాలని, ఎఫ్‌ఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని, 4 కి.మీ. దూరం పనికి వెళితే ఆటో చార్జీలు సైతం చెల్లించాలన్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 9న హైదరాబాద్‌లోని గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనరేట్ (సీఆర్‌డీ) ఎదుట నిర్వహించే ధర్నాలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

‘పాలమూరు’కు మరో అమాత్యగిరి



మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి

- ముదిరాజ్ సామాజిక వర్గం నుంచి కేబినెట్ బెర్త్ ఖరారు
- ఫైనల్ చేసిన కాంగ్రెస్ అధిష్టానం..
- నేడు ప్రమాణస్వీకారం చేసే అవకాశం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఉమ్మడి పాలమూరుకు మరో అమాత్యగిరి దక్కనుంది. నారాయణపేట జిల్లా మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న వాకిటి శ్రీహరిని మంత్రి పదవి వరించనుంది. కాంగ్రెస్ అధిష్టానం ఫైనల్ చేసిన జాబితాలో ఆయన పేరున్నట్లు గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. బీసీ కోటాలో వాకిటితో పాటు రాష్ట్రంలో పలు సామాజిక వర్గాలకు చెందిన మరో ముగ్గురు లేదా నలుగురికి సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో చోటు దక్కనున్నట్లు తెలుస్తోంది. అంతా అనుకున్నట్లు జరిగితే ఆదివారం మధ్యాహ్నం తర్వాత ఆయన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది.



● కర్ణాటక సరిహద్దులో ఉన్న మక్తల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీహరికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గేతో మంచి సాన్నిహిత్యం ఉంది. మొదటి నుంచీ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేస్తారనే పేరు శ్రీహరికి ఉంది. సర్పంచ్‌గా, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుడిగా పనిచేసిన అనుభవం ఉండగా.. నారాయణపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా సైతం బాధ్యతలు చేపట్టారు. ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తలపెట్టిన భారత్ జోడో యాత్రను మక్తల్ నియోజకవర్గంలో విజయవంతం చేసి ప్రశంసలు పొందారు. రాష్ట్రంలో బీసీ జనాభాలో అత్యధికంగా ఉన్న ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వాకిటికి మంత్రి పదవి.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మేలు చేస్తుందని పార్టీ పెద్దలు భావిస్తున్నారు. ఇవన్నీ శ్రీహరికి కలిసి రాగా.. ఆయన పేరు ఖరారైనట్లు గాంధీ భవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎలాంటి అవరోధాలు లేకుంటే ఎమ్మెల్యేగా గెలిచిన తొలి సారే మంత్రి అయిన ఘనత శ్రీహరికి దక్కనుంది.

ఖర్గేతో సాన్నిహిత్యం..

రాహుల్‌తో ప్రశంసలు..

కాంగ్రెస్‌లో ఒకే ఒక్క ముదిరాజ్ ఎమ్మెల్యే..

రాష్ట్రంలో బీసీ సామాజిక వర్గంలో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజ్‌లకు మొదటి విడతలో మంత్రి పదవి లభించలేదు. దీంతో ముదిరాజ్‌ల నుంచి విమర్శలు వెల్లువెత్తగా.. రెండో విడతలో చేపట్టే మంత్రి వర్గ విస్తరణలో ఆ సామాజిక వర్గానికి మంత్రి పదవి ఖాయమని కాంగ్రెస్ పెద్దలు సంకేతాలు ఇచ్చారు. గతేడాది లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా పలుమార్లు ఉమ్మడి జిల్లాలో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ముదిరాజ్‌ల విజ్ఞప్తి మేరకు వారిని బీసీ–డీ నుంచి ఏ కేటగిరికి మారుస్తామని.. దీంతోపాటు ఈసారి మంత్రివర్గ విస్తరణలో ముదిరాజ్‌లకు స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఆ సామాజిక వర్గానికి చెంది.. అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న వారిలో వాకిటి శ్రీహరి మాత్రమే ఉన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర కేబినెట్ కూర్పులో ఆయనకు బెర్త్ ఖరారైంది. కాగా.. కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా, కొల్లాపూర్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న జూపల్లి కృష్ణారావు మంత్రిగా ఉండగా ఇప్పుడు శ్రీహరికి బెర్త్ దక్కడంతో.. రాష్ట్ర కేబినెట్‌లో ఉమ్మడి పాలమూరు జిల్లాకు పెద్దపీట వేసినట్లయింది.

● నాడు కూలీలు.. నేడు వాటాదారులు

పురోగమనంలో అమరచింత

అంచెలంచెలుగా ఎదిగిన ‘చేనేత’ సహకారం

- లాభాల్లో సభ్యులందరికీ వాటా
- 40 మందితో ప్రారంభమై.. 538 మందితో విస్తరణ
- అంతర్జాతీయ స్థాయిలో చీరల విక్రయాలకు తోడ్పాటు
- నెలకు రూ.12 వేల నుంచి 30 వేల ఆదాయంతో జీవనోపాధి

సండే స్పెషల్

ఎక్కడైనా ఒక కంపెనీ ఉంటే అందులో ఒకరు యజమాని కాగా.. మిగతా వారంతా కార్మికులు ఉంటారు. కానీ, అమరచింత చేనేత ఉత్పత్తుల సంఘంలో కార్మికులందరూ వాటాదారులే.. 2019లో రిజిస్ట్రేషన్ అయిన ఈ సంఘం మొదట్లో 40 మందితో ప్రారంభమై.. ప్రస్తుతం 538 మందితో విస్తరించింది. ఇక్కడ నేస్తున్న జరీ చీరలను జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లి విక్రయాలు సాగిస్తున్నారు. అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతున్న ఈ సంఘం.. ఏడాదికి రూ.కోటిన్నర విక్రయాలు సాధించే స్థాయికి చేరింది. దీంతో పాటు ఇక్కడ నేత కార్మికులు నెలకు రూ.12 వేల నుంచి రూ.30 వేల వరకు సంపాదిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. తయారు చేసిన చీరలకు వేతనాలే కాకుండా అమ్మకాలతో వచ్చిన లాభాల్లో ప్రతి ఒక్కరికి వాటా పంచుతున్నారు. నాబార్డు ద్వారా రూ.2 కోట్ల రుణం మంజూరు కావడంతో షెడ్ నిర్మాణంతో పాటు మగ్గాలను తెప్పించి వాటి ద్వారా కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నారు.

– అమరచింత



కంపెనీ ఆధ్వర్యంలో మగ్గాల నిర్వహణ

అమరచింతకు చెందిన మహంకాళి శేఖర్ స్థానిక చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో పలు సందర్భాల్లో చేనేత కార్మికులతో సమావేశమై.. సొంతంగా చేనేత వస్త్రాల తయారీ, విక్రయదారుల సంఘం ఏర్పాటు చేద్దామని ప్రయత్నాలు ప్రారంభించాడు. దీంతో మొదట 2019లో 20 మంది సభ్యులతో కలిసి ‘చేనేత ఉత్పత్తి సంఘం’ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించారు. మొదట్లో రూ.24 వేలు మాత్రమే ఉండగా.. 2020లో కోవిడ్ సమయంలో రూ.5 లక్షలు నాబార్డు నుంచి మంజూరయ్యాయి. అలాగే ఎంఎస్‌ఎంఈ ద్వారా రూ.2 కోట్లు రుణం రావడంతో సీఎఫ్‌సీ, 135 మగ్గాలు, టైలరింగ్ శిక్షణ కోసం భవనం, వర్కింగ్ క్యాపిటల్‌కు ఉపయోగించారు. 2021 జనవరిలో 10 మగ్గాలతో ప్రారంభమైన కంపెనీలో 2021 నాటికి 150 మంది వాటాదారులు అయ్యారు. 2021 మార్చి నాటికి అమ్మకాలు రూ.25 వేలు ఉండగా.. 2022 మార్చి నాటికి రూ.65 లక్షలకు, 2023 మార్చి నాటికి సంఘం ద్వారా చేనేత వస్త్రాల అమ్మకాలతో రూ.కోటి వ్యాపారం జరిగిందని కంపెనీ సీఈఓ వెల్లడించారు.

40 మందితో ప్రారంభం.. 20 మందితో కమిటీ

అమరచింత చేనేత ఉత్పత్తిదారుల సంఘం 2019లో 40 మంది సభ్యులతో కంపెనీ ప్రారంభమవగా.. 20 మంది కార్మికులతో కలిసి కమిటీ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి కలిసి శ్రమించడం, తయారు చేసిన ఉత్పత్తులను అమ్మడం ద్వారా వచ్చే ఆదాయం సమానంగా పంచుకోవడం చేస్తున్నారు. ప్రతి నెల వేతనాలు పొందడం వంటి కార్యక్రమాలు జరుగుతాయని హామీ ఇవ్వడంతో ఒక్కొక్కరుగా చేనేత కార్మికులు ముందుకు వచ్చి కంపెనీలో సభ్యత్వం పొంది షేర్ హోల్డర్లుగా భాగస్వామ్యమయ్యారు. కంపెనీలో ప్రస్తుతం 250 మగ్గాలతో నిర్వహణ కొనసాగుతుంది. దీంతో పట్టణంలోని ప్రతి ఇంటికి మగ్గాలను ఇవ్వడం, వారు తయారు చేసిన చీరలను అమ్మడం వంటి కార్యక్రమాలతో నిర్వహణ విజయవంతంగా సాగుతోంది. కంపెనీ నిర్వహణకు నాబార్డుతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం ఉండటంతో అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతోంది.



అమరచింతలోని చేనేత ఉత్పత్తిదారుల సంఘం భవనం



మగ్గాలపై చీరలు నేస్తున్న కార్మికులు

దేశ, విదేశాల్లో అమ్మకాలు..

అమరచింతలో తయారు చేసిన జరీ చీరలను అమెరికా, లండన్, న్యూజిలాండ్ తదితర దేశాల్లో అమ్మకాలు జరుగుతున్నాయి. ఇక్కడి నుంచి వెళ్లి ఆయా దేశాల్లో స్థిరపడిన భారతీయుల సహకారంతో అమరచింత చేనేత ఉత్పత్తులు సంఘం సీఈఓ నాబార్డు వారి సహకారంలో ఆన్‌లైన్‌లో ఆర్డర్లు బుక్ చేసుకుని చీరలను ఆయా దేశాలకు పంపడం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో ఆదరణ లభిస్తోంది.

మూలధనం పెంపు

కొన్నేళ్లుగా జరీ చీరలు నేస్తూ వాటిని ఇతరులకు అమ్మడం ద్వారా వస్తున్న ఆదాయాన్ని బ్యాంకు ఖాతాలో జమ చేస్తూ వాటి మూలధనం పెంచుకుంటున్నారు. ప్రస్తుతం రూ.కోటిన్నర మేరకు క్రయవిక్రయాలు జరుగుతున్నట్లు కంపెనీ సీఈఓ తెలిపారు. ప్రతినెలా జరీ చీరలను తయారు చేసిన నేతన్నలకు వేతనాలు ఇవ్వడమే కాకుండా వచ్చిన లాభాలను సమానంగా పంచి ఇవ్వడంతో కంపెనీలో ఎలాంటి గొడవలు జరగకుండా ఐక్యంగా ముందుకు సాగుతున్నారు.

నెలకు మూడు చీరలు..



గతంలో మాస్టర్ వీవర్స్‌పై ఆధారపడి మగ్గాలపై చీరలు నేసి కుటుంబాన్ని పోషించుకునే వాడిని. ప్రస్తుతం కంపెనీ ద్వారా ముడి సరుకులతో పాటు మగ్గాన్ని ఇవ్వడం, తయారు చేసిన చీరలకు మాస్టర్ వీవర్స్ కంటే అధిక ధర వస్తుంది. దీంతో మూడేళ్లుగా నెలకు మూడు జరీ చీరల తయారీతో రూ.12 వేల ఆదాయం పొందుతున్నా.

– దాస్‌పత్తి తిమ్మప్ప, నేత కార్మికుడు

అత్యంత ప్రామాణికంతో..



చేనేత ఉత్పత్తుల సంఘం ఏర్పాటుతో తమకు జీవనోపాధి దొరికినట్లయింది. మాస్టర్ వీవర్స్ వద్ద చీరలు నేయడం వల్ల వారం, పక్షం రోజులకు వేతనాలు అందించే వారు. ప్రస్తుతం సంఘం ద్వారా చీరలు నేస్తూ నెలకు రెండు చీరలను అత్యంత ప్రామాణికంతో తయారు చేయడం వల్ల అధిక డబ్బులు వస్తున్నాయి. నెలలో రెండు చీరల తయారీతో రూ.20– 25 వేల ఆదాయం వస్తుంది.

– స్వప్న, నేత కార్మికురాలు

స్థల ప్రభావం లేదు..



ఇంట్లో మగ్గాల ఏర్పాటుకు స్థలాలు ఉండేవి కాదు. దీంతో కిరాయి ఇంట్లో ఉంటూ మగ్గాలను నేసుకొని చీరలు తయారు చేసేవాళ్లం. ప్రస్తుతం సంఘం ద్వారా భవనం నిర్మించడం, వీటిలోనే మగ్గాలు ఏర్పాటు చేయడంతో ప్రతిరోజు అక్కడికే వెళ్లి జరీ చీరలు నేస్తూ జీవనం సాగిస్తున్నా.

– పద్మ, నేత కార్మికురాలు

నెలవారీగా వేతనాలు..



అప్పట్లో యజమానుల ద్వారా డబ్బులు తీసుకుని చీరలు నేసి వాటి ద్వారా అడ్వాన్సుగా తీసుకున్న డబ్బులను చెల్లించేవాళ్లం. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. స్వయంగా తయారు చేసిన చీరలకు క్రమం తప్పకుండా నెలవారీగా వేతనాలు బ్యాంక్ ఖాతాలో జమ చేస్తున్నారు.

– గంజి కృష్ణయ్య

చేనేత అంతరించకుండా..



పుట్టి పెరిగిన ఊరిలో చేనేత కార్మికులు ఉపాధి కోల్పోవడం చూసి సగటు నేత కార్మికుడిగా ఎంతో బాధపడ్డా. ఇలాంటి పరిస్థితుల నుంచి చేనేత పరిశ్రమను కాపాడాలని భావించా. స్వయంగా నేత కార్మికులను యజమానులను చేయాలనుకున్నా. నాబార్డుతో సంప్రదించి కంపెనీ ఏర్పాటుకు ప్రయత్నించా. కార్మికులు, ప్రజల సహకారంతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధుల చొరవతో కంపెనీ ఏర్పాటు చేశాను. 40 మందితో ప్రారంభించి ఇప్పుడు 538 కార్మికులతో కొనసాగుతోంది. వచ్చిన ఆదాయంతో పాటు తయారు చేసిన చీరలకు నెలవారీగా వేతనాలు అందిస్తూ కార్మికుల ఆర్థిక పురోగతికి కృషి చేస్తున్నాం.

– మహంకాళి శేఖర్, కంపెనీ సీఈఓ



అమరచింత చేనేత ఉత్పత్తుల కార్యాలయంలో చీరలు కొంటున్న ఇండిరోజ్ సంస్థ ప్రతినిధులు (ఫైల్)

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు



జిల్లాకేంద్రంలోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


స్టేషన్ మహబూబ్‌నగర్: బక్రీద్ (ఈద్ ఉల్ అజ్‌హా) పండుగను ముస్లింలు శనివారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాలు, గ్రామాల్లో ఉదయం నుంచే ఆనందోత్సాహాలతో ఈద్గాలు, మసీదుల వద్దకు చేరుకొని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జిల్లాకేంద్రంలోని రహమానియా ఈద్గాలో వేలాదిమంది ముస్లింలు ఈద్ ప్రార్థనలు చేశారు. జామియా మసీదు ప్రధాన ఇమామ్ మౌలానా మహ్మద్ హాఫిజ్ ఇస్మాయిల్ ప్రత్యేక ప్రార్థనలు జరిపించారు. పండుగ ప్రాశస్త్యాన్ని ఖుత్‌బా రూపంలో వివరించారు. అనంతరం లోక కల్యాణం కోసం దువా (ప్రార్థన) చేశారు. బక్రీద్‌ను పురస్కరించుకొని పలువురు ప్రముఖులు ముస్లింలకు ఈద్ ముబారక్ చెప్పారు. ఖ్వామీ ఏక్తా కమిటీ తరఫున ఈద్గా ఆవరణలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. త్యాగాన్ని, క్షమను గుర్తు చేస్తూ స్వార్థాన్ని త్యజించాలన్నదే బక్రీద్ పండుగ మనకు ఇచ్చే సందేశం అన్నారు. ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు సంజీవ్ ముదిరాజ్, వినోద్‌కుమార్, భగవంతురావు ఉన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షబ్బీర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, అబ్దుల్ జకీ, అజ్మత్అలీ, అవేజ్, ఫయాజ్, గులాం జహీర్, షాఫైసల్, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. బక్రీద్‌ను పురస్కరించుకుని ఈద్గాల వద్ద ప్రత్యేక పోలీసు బందోబస్తు నిర్వహించారు.



‘సీఈఐఆర్’తో పట్టేస్తున్నారు..!

- చోరీకి గురైన సెల్‌ఫోన్ల గుర్తింపులో సాంకేతిక తోడ్పాటు
- రూ.వేల విలువైన ఫోన్లు తిరిగి వస్తుండటంతో బాధితుల ఆనందం

మహబూబ్‌నగర్ క్రైం: ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో మనిషి రోజువారి దినచర్యలో సెల్‌ఫోన్ భాగమైంది. ప్రతిఒక్కరి దగ్గర విలువైన స్మార్ట్‌ఫోన్లు ఉంటున్నాయి. అయితే గతంలో ఫోన్లు చోరీకి గురైనా లేదా ఎక్కడైనా పోగొట్టుకున్నా తిరిగి దొరకడం చాలా కష్టంగా ఉండేది. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కోల్పోయిన ఫోన్లను వెంటనే గుర్తించి బాధితులకు అప్పగిస్తున్నారు. సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను వెనువెంటనే గుర్తించి రికవరీ చేస్తున్నారు. జిల్లాలో ఇటీవల కాలంలో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ల రికవరీ శాతం గణనీయంగా పెరిగింది. దీంతో రూ.వేలు వెచ్చించి కొనుగోలు చేసిన ఫోన్లు పలు సందర్భాల్లో చోరీలకు గురై కోల్పోయిన బాధితులు సకాలంలో తిరిగి లభించడం వల్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పోలీస్‌స్టేషన్ల వారీగా..

జిల్లాలో 2024లో 3,261 సెల్‌ఫోన్లు పోయినట్లు ఫిర్యాదులు అందగా ఇందులో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా 1,141 ఫోన్లను గుర్తించి బాధితులకు అప్పగించారు. ఇందులో అత్యధికంగా జడ్చర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో 715, మహబూబ్‌నగర్ టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 576 ఫిర్యాదులు, వన్‌టౌన్ 381, రూరల్ 337, దేవరకద్ర 230, బాలానగర్ 210 ఫిర్యాదులు వచ్చాయి. ఇక ఈ ఏడాది మే 31 వరకు 1,348 ఫిర్యాదులు రాగా.. ఇందులో 520 ఫోన్లను రికవరీ చేయడం జరిగింది.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు..

సీఈఐఆర్ పోర్టల్ వంటి సాంకేతికత అందుబాటులోకి వచ్చిన తర్వాత బాధితులు కోల్పోయిన సెల్‌ఫోన్లు త్వరగా రికవరీ చేసి తిరిగి అప్పగిస్తున్నాం. బాధితులు ఎవరైతే ఫోన్లు కోల్పోయిన వారు ఉంటే మొదట సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి తర్వాత సదరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.

– వెంకటేశ్వర్లు, డీఎస్పీ

ఈ ఏడాది చోరీకి గురైన సెల్‌ఫోన్ల వివరాలు

పోలీస్‌స్టేషన్	మొత్తం ఫిర్యాదులు	రికవరీ చేసిన ఫోన్లు
అడ్డాకుల	12	1
బాలానగర్	91	40
చిన్నచింతకుంట	41	30
భూత్పూర్	101	27
దేవరకద్ర	99	31
హన్వాడ	29	20
జడ్చర్ల	284	103
కోయిలకొండ	13	4
మ.నగర్ రూరల్	149	63
వన్‌టౌన్	145	35
టూటౌన్	224	103
మిడ్జిల్	33	15
మహమ్మదాబాద్	26	20
మూసాపేట్	26	20
నవాబ్‌పేట	43	10
రాజాపూర్	29	5

క్లుప్తంగా

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

దామరగిద్ద: అనారోగ్యం వల్ల మనస్తాపానికి గురై ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం మండలంలో చేసుకుంది. ఎస్ఐ రాజు వివరాల ప్రకారం.. మండలంలోని మొగుల్‌మడ్క గ్రామానికి చెందిన రాములుగౌడ్ (28) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తీవ్ర మనస్తాపంలో శుకవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కిందకి దించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. అతనికి భార్య సుగుణమ్మ, కూతురు ఉన్నారు.

కంటైనర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై కంటైనర్ వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ కథనం మేరకు.. గద్వాల మండలంలోని గోనుపాడు గ్రామానికి చెందిన కుర్వ రాముడు (50) అదే గ్రామానికి చెందిన మరో ఇద్దరితో కలిసి బొలెరోలో పెబ్బేరు సంతకు వెళ్లారు. ఈ క్రమంలో తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా బీచుపల్లి సమీపంలోని కృష్ణానది బ్రిడ్జిపై వారు ప్రయాణిస్తున్న బొలెరో వాహనం పంచర్ కావడంతో మరమ్మతు చేశారు. అనంతరం తిరిగి బొలెరోను ఎక్కేందుకు వెళ్తున్న రాముడిని హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న కంటైనర్ వాహనం అతి వేగంతో వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్ ద్వారా గద్వాలకు తరలించగా పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుడు కుర్వ మద్దిలేటి ఫిర్యాదు మేరకు ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నాడు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన బుచ్చమ్మ (70) చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందింది. ఎస్ఐ గోవర్ధన్ వివరాల మేరకు.. శ్రీనగర్ కాలనీకి చెందిన బుచ్చమ్మ (70) ఈ నెల 3న తన ఇంటి ఎదుట చెత్తను కాల్చివేస్తుండగా, ప్రమాదవశాత్తు శరీరానికి మంటలు అంటుకోవడంతో గాయపడింది. కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి మృతిచెందింది. మృతురాలి సోదరి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి మృతిపై ఫిర్యాదు

కల్వకుర్తి టౌన్: యువకుడి మృతిపై అనుమానం ఉందని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మాధవరెడ్డి ఆదివారం తెలిపారు. ఎస్ఐ, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని హరిజనవాడకు చెందిన అర్జున్ (30) ఆదివారం మధ్యాహ్నం బస్టాండ్‌లో పని ముగించుకొని ఇంటికి వస్తున్నానని కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలిపాడు. ఇంటికి వెళ్లిన తన అన్న రవీందర్ ఇంటి తలుపులు తెరిచి చూసే సరికి అర్జున్ అపస్మారస్థితిలో పడి ఉండటాన్ని చూసి, వెంటనే పట్టణంలోని సీహెచ్‌సీ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లుగా నిర్ధారించారురు. తమ్ముడి మృతిపై అనుమానం ఉందని అన్న రవీందర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

దొంగతనం కేసులో వ్యక్తికి రిమాండ్

ఖిల్లాఘనపురం: దొంగతనం కేసులో ఓ వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన ఘటన శనివారం ఖిల్లా ఘనపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 5న మండలంలోని వెంకటాంపల్లిలోని దేవరశెట్టి వెంకటేష్ ఇంట్లో దొంగతనం జరిగింది. ఇంట్లో ఉన్న 7.5 తులాల వెండి మొలతాడుతో పాటుగా రూ.30 వేల నగదును దొంగిలించారు. బాధితుడు వెంకటేష్ అదే రోజున పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులకు అదే గ్రామానికి చెందిన చిలుక చెన్నయ్యపై అనుమానం రావడంతో విచారించారు. దీంతో చెన్నయ్య దొంగతనం తానే చేసినట్లు విచారణలో ఒప్పుకున్నాడు. అతడిని అరెస్టు చేసి వనపర్తి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి నిందితుడికి రిమాండ్ విధించారని ఎస్ఐ సురేష్‌గౌడ్ తెలిపారు.

పిడుగుపాటుకు కాడెద్దు మృతి



జడ్చర్ల: మండలంలోని తుపుడగడ్డతండా శివారులో శనివారం పిడుగు పాటుకు కాడెద్దు మృత్యువాత పడిన సంఘటన చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. తుపుడుగడ్డతండా శివారులోని వ్యవసాయ పొలంలో చెట్టు కింద ఉన్న కాడెద్దులపై పిడుగు పడడంతో ఓ ఎద్దు అక్కడికక్కడే మృత్యువాత పడింది. ఎద్దు విలువ రూ.90వేలు ఉంటుందని బాధిత రైతు జర్పుల శంకర్‌నాయక్ వాపోయాడు.

మైసమ్మ అడవి ప్లాస్టిక్ రహితం

అటవీ సంరక్షణకు ప్రభుత్వం చర్యలు



నల్లమలను తలపిస్తున్న మైసమ్మ అడవి

నవాబుపేట: నల్లమల అటవీ ప్రాంతం సరసన పర్వతాపూర్ మైసమ్మ అడవి నిలుస్తోంది. అక్కడ పెద్దపులులు ఇతర వన్యప్రాణులు ఉండగా.. ఇక్కడ చిరుతలకు ఆవాసంగా అటవీ ప్రాంతం ఉంది. అయితే అటవీ ప్రాంతాల్లోని మార్గాల్లో ప్రయాణించే వారు ప్లాస్టిక్ వ్యర్థాలు వేస్తుండటంతో వన్యప్రాణ్యుల మనుగడకు ముప్పు పొంచి ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్లాస్టిక్ రహితంగా అడవులను తీర్చిదిద్దాలని సంకల్పించింది. నల్లమల తరహాలోనే మైసమ్మ అడవిని సైతం ప్లాస్టిక్ రహితంగా చేయాలని ఆదేశాలు జారీ చేసింది. కాగా, రాష్ట్రస్థాయిలో పర్వతాపూర్ మైసమ్మ అడవిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ప్రతి ఆది, మంగళవారాల్లో మైసమ్మ దర్శనానికి వేలాది భక్తులు వస్తుంటారు. ఇతర రోజుల్లో సైతం అడవిలో రద్దీ ఉంటోంది. ఈ తరుణంలో అడవి సంరక్షణ కోసం అందరూ బాధ్యతగా ప్లాస్టిక్ నిషేధం పాటించాల్సిన అవసరం ఉంది.

అందరూ సహకరించాలి..



మైసమ్మ అడవిని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలి. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు ప్లాస్టిక్ వ్యర్థాలను అడవిలో వేయొద్దు. ఆలయ ఆవరణలోని వ్యాపారులు సైతం ప్లాస్టిక్ వినియోగం మానుకోవాలి. అడవిలో ఆధ్యాత్మిక వాతావరణం కల్పించేందుకు అందరూ సహకరించాలి.

– జగన్మోహన్‌రెడ్డి, మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్

ఏడు గంటల వ్యవధిలో కేసు ఛేదన



ఏడు గంటల వ్యవధిలోనే లారీని ఛేదించిన పోలీసులు.

- చోరీకి గురైన రూ.15లక్షల విలువ గల లారీ స్వాధీనం
- పరారీలో నిందితులు

గద్వాల క్రైం: నిలిపి ఉంచిన 10 టైర్ల లారీని గుర్తు తెలియని దుండగులు అపహరించిన ఘటనలో పోలీసులు ఏడు గంటల వ్యవధిలోనే కేసును ఛేదించారు. పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ శనివారం తెలిపిన వివరాల మేరకు. ఈ నెల 5వ తేదీన తెల్లవారుజామున గద్వాల పట్టణంలోని మార్కెట్ యార్డులో ఏపీ 39 వీడీ 6377 నంబర్ గల 10 టైర్ల గల లారీని నలిపి యాజమాని సాధిక్ ఇంటికి వెళ్లాడు. అయితే సాయంత్రం 3 గంటల సమయంలో వచ్చి చూడగా లారీ కనిపించలేదు. ఆందోళన చెందిన సాధిక్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సమీప సీసీ కెమెరాలను పరిశీలించగా లారీ ఎర్రవల్లి వైపుగా వెళ్తున్నట్లు రికార్డు అయ్యిందన్నారు. వాటి ఆధారంగా లారీని అపహరించిన దుండగులను పట్టుకునేందుకు సిబ్బంది టోల్‌ప్లాజాల వద్ద పహారాగా ఉండగా దుండగులు చాకచాక్యంగా వ్యవహరించారన్నారు. పెబ్బేరు, వనపర్తి, బిజినేపల్లి, బాలానగర్ మీదుగా రాయకల్ టోల్‌ప్లాజా సమీపంలోని ఓ దాబా వద్ద లారీని నిలిపిన దుండగులు నంబర్‌ను ఏపీ 39 డబ్ల్యూ 3553గా మార్పులు చేసి తప్పించుకునే ప్రయత్నం చేశారు. అప్పటికే సిబ్బంది లారీని గుర్తించి అక్కడికి చేరుకోవడంతో దుండగులు తప్పించుకున్నారన్నారు. శనివారం తెల్లవారుజామున లారీని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. లారీ విలువ రూ.15లక్షలు ఉంటుందన్నారు. కేసు ఛేదనలో సాంకేతిక విభాగ సిబ్బంది చంద్రయ్య, కిరణ్, రాజుయాదవ్ కీలకంగా వ్యవహరించారన్నారు. సీసీ కెమెరా రికార్డుల ద్వారా నిందితులను గుర్తించి త్వరలోనే వారిని అదుపులోకి తీసుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

చిన్నరాజమూర్ గుట్టల్లో చిరుత సంచారం



చిన్నరాజమూర్ గుట్టలపై సంచరిస్తున్న చిరుత

దేవరకద్ర రూరల్: దేవరకద్ర మండలం, చిన్నరాజమూర్ సమీపంలోని పులిగుట్టపై శనివారం చిరుత సంచారం కలకలం రేపింది. సాయంత్రం సమయంలో రహదారిపై వెళ్తున్న గ్రామ యువకులకు గుట్టపై చిరుత సంచరిస్తూ కనిపించింది. కొద్దిసేపు గుట్టపై అటు, ఇటు తిరిగి అక్కడే ఉన్న చిన్న గుహలోకి వెళ్లిందని, చిరుతతో పాటు ఒక చిన్న చిరుత పిల్ల కూడా ఉండటం గమనించినట్లు యువకులు తెలిపారు. గుట్టపై చిరుత సంచరిస్తున్నట్లు ప్రచారం జరగడంతో స్థానికులు, సమీప వ్యవసాయ పొలాల రైతులు భయాందోళనకు గురయ్యారు. ఈ విషయంపై అధికారులకు సమాచారం అందించినట్లు గ్రామస్తులు తెలిపారు.

ప్రభుత్వ బడులను బలోపేతం చేద్దాం



బడిబాట కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు, సంఘం నాయకులు

కొత్తకోట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపునకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు కోరారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో జరిగిన బడిబాట కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మండలంలోని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతున్నారని.. ఉచితంగా యూనిఫామ్స్, పాఠ్య, రాత పుస్తకాలు, సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన బోధన అందుతుందని.. బడిబాట ద్వారా బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించేలా ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టుల్లో వలంటీర్లను నియమించాలని, పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీ నివేదిక తెప్పించుకొని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎలాంటి అన్యాయం జరిగినా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమ కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల అమరేందర్‌రెడ్డి, మండల విద్యాధికారి కృష్ణయ్య, నోడల్ అధికారి కుర్మయ్య, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వివేకానంద, తపస్ ప్రధానకార్యదర్శి విష్ణువర్ధన్, ఉపాధ్యక్షులు దేవన్న, శివ నారాయణ, లక్ష్మయ్య, రాములు, అరవింద్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం

తిమ్మాజిపేట: విద్యార్థి అదృశ్యమైన ఘటనలో శనివారం కేసు నమోదైంది. ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన విద్యార్థి మేకల హేమంత్(19) మహబూబ్‌నగర్‌లోని ధన్వంతరీ ఫార్మసీ కళాశాలలో బీఫార్మసీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 4న పుస్తకాలు తెచ్చుకుంటానని తల్లి రేణుకకు చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో బంధువులు, మిత్రులు, చుట్టు పక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. శనివారం విద్యార్థి తండ్రి మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

జూరాలకు నిలకడగా ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం ప్రాజెక్టుకు 7,500క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. నెట్టెంపాడు ఎత్తిపోతల ద్వారా 1500 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–1కు 650 క్యూసెక్కులు, కోయిల్ సాగర్‌కు 315 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 68 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 2,533 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 8.551 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.



9,10 తేదీల్లో ఇంట్రా డిస్ట్రిక్ట్ మహిళా క్రికెట్ లీగ్



ఎండీసీఏ మైదానంలో ఎంపికలకు హాజరైన మహిళా క్రికెటర్లు (ఫైల్)

- మూడు జట్లతో లీగ్ నిర్వహణ
- లీగ్‌లో అధిక పాయింట్లు సాధించిన జట్టు విజేత

మహబూబ్‌నగర్ క్రీడలు: ఎండీసీఏ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో మొదటిసారిగా ఇంట్రా డిస్ట్రిక్ట్ ఉమెన్స్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా అండర్–23, అండర్–19 ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ లీగ్‌లను విజయవంతంగా నిర్వహించారు. ఇప్పుడు మహిళా క్రికెట్ లీగ్ పోటీలకు శ్రీకారం చుట్టారు.

9, 10 తేదీల్లో మహిళా క్రికెట్ లీగ్

ఉమ్మడి జిల్లాలో మొదటిసారిగా మహిళా క్రికెట్ లీగ్ నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 9,10 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి సమీపంలోని సమర్థ స్కూల్ మైదానంలో మహిళా క్రికెట్ లీగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎండీసీఏ ఆధ్వర్యంలో లీగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు. లీగ్‌లో పాల్గొనే జట్లను ఈనెల 1న ఎంపిక చేశారు. బ్యాటింగ్, బౌలింగ్ అంశాల్లో పరీక్షించి క్రీడాకారిణులను ఎంపిక చేశారు. లీగ్‌లో ఎక్కువ పాయింట్లు సాధించిన జట్టు చాంపియన్‌గా నిలుస్తుంది.

లీగ్ మ్యాచ్‌ల వివరాలు..

క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌లో పాల్గొనే మహిళా క్రీడాకారిణులను మూడు జట్లుగా విభజించారు. 30 ఓవర్ల మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఈనెల 9న రెడ్–బ్లూ జట్లు, బ్లూ–పింక్ జట్లు, 10న పింక్–రెడ్ జట్లు లీగ్ మ్యాచ్‌లు ఆడనున్నాయి.

బ్లూ మహిళా జట్టు.. మంజుల (కెప్టెన్), స్వాతి, కరీనా, మనీషా, ప్రవళిక, శ్రవంతి, దివ్య, నిర్మల, తనుజశ్రీ, తేజశ్రీ, శారద, సాయిశృతి, సాయి ప్రణవి, స్పందన, సంజన.

రెడ్ జట్టు... అనిత (కెప్టెన్), అక్షర రాథోడ్, వైశాలి, అనూష, మహేశ్వరి, మంజు, ప్రతీక, మీనాక్షి, సింధూజ, కీర్తన, గోపిక, యూ.కీర్తన, నందిని, లోకేశ్వరి, భానుమతి.

పింక్ జట్టు.. త్రివేణి (కెప్టెన్), ఇందు, నిహారిక, చంద్రకళ, పవిత్ర, రిషికాసాయి, ఎస్.కవిత, మనీషా, వెన్నెల, శైలు, మేఘన, ఎం.నందిని, మౌనిక, పద్మ, ఐశ్వర్య.

హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్‌కు కృతజ్ఞతలు..



ఉమ్మడి జిల్లాలో తొలిసారిగా ఇంట్రా డిస్ట్రిక్ట్ ఉమెన్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నందుకు హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నాం. ఉమ్మడి జిల్లాలో మూడు జట్లతో మహిళా లీగ్ నిర్వహించడానికి ఏర్పాటు చేస్తున్నాం. ఈ అవకాశాన్ని మహిళా క్రికెటర్లు సద్వినియోగం చేసుకోవాలి. హెచ్‌సీఏ మహిళా లీగ్‌లో ఉమ్మడి జిల్లా క్రీడాకారిణులు ప్రతిభ చాటాలి. త్వరలో జరిగే హెచ్‌సీఏ ఉమెన్స్ లీగ్‌లో పాల్గొనే ఉమ్మడి మహిళా జట్టును ఈనెల 10న ఎంపిక చేస్తాం. ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్‌లో మహిళా క్రీడాకారిణులు రాణించాలి. ఇటీవల అండర్–23 టూడేలీగ్, అండర్–19 లీగ్‌లను విజయవంతంగా నిర్వహించాం. మహిళా క్రికెట్ లీగ్‌ను కూడా అదే విధంగా నిర్వహిస్తాం.

– ఎం.రాజశేఖర్, ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి

ముగిసిన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు



చంద్ర పుష్కరిణిలో స్నానం ఆచరిస్తున్న భక్తులు

కందనూలు: మండలంలోని శ్రీపురం రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ నెల 4న ఉత్సవాలు ప్రారంభం కాగా.. మూడు రోజులపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. చివరి రోజున మహా పూర్ణాహుతి, పల్లకీసేవ, చక్రస్నానం, ద్వాదశరాధన, సప్తవర్ణాలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని చంద్ర పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానం ఆచరించారు.

ఆర్టీసీ బస్సులో మహిళల సిగపట్లు




బస్సులో గొడవ పడుతున్న మహిళలు

వనపర్తి రూరల్: పాన్‌గల్ మండలం బుసిరెడ్డిపల్లి నుంచి వనపర్తి జిల్లా కేంద్రానికి వస్తున్న ఆర్టీసీ బస్సులో శనివారం మహిళలు సిగపట్లు పట్టారు. బస్సులో సీటు కోసం మహిళల మధ్య మొదలైన గొడవ.. ఒకరిపై ఒకరు దాడి చేసుకునే స్థాయికి చేరింది. తోటి ప్రయాణికులతో పాటు బస్సు కండక్టర్ సర్దిచెప్పినా ఫలితం లేక పోయింది. మహిళల మధ్య గొడవ తారస్థాయికి చేరుకోవడంతో రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద బస్సును డ్రైవర్ నిలిపారు. గొడవకు దిగిన మహిళలను బస్సులో నుంచి దించి అందరూ సర్దిచెప్పడంతో శాంతించారు. అదే బస్సులో బస్టాండ్‌కు వెళ్లిపోయారు. ఈ ఘటనపై ఎస్ఐ జలేందర్‌రెడ్డిని వివరణ కోరగా.. బాధితుల నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

నాణ్యమైన విత్తనంతో అధిక దిగుబడి

పాడి-పంట

జిల్లా వ్యవసాయాధికారి, సక్రియానాయక్



ఫౌండేషన్ సీడ్ ట్యాగ్



సర్టిఫైడ్ సీడ్ విత్తనాలు

అలంపూర్: నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడి సాధ్యమని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి సక్రియ నాయక్ పేర్కొన్నారు. వర్షాలు ప్రారంభం కావడంతో రైతులు పంటల సాగుకు సన్నద్ధం అవుతుండడంతో ఆయన పలు సూచనలు చేశారు. బ్రీడర్, సర్టిఫైడ్, టూత్ ఫూల్ లేబుల్స్‌లో నాణ్యమైన విత్తనాలు లభిస్తాయని ఇందులో ఏ రకాన్ని సాగు చేసినా మంచి ఫలితం ఉంటుందన్నారు. వీటితో రైతులు విత్తన భారం తగ్గించుకోవడంతో పాటు తోటి రైతులకు అందించి అధిక రేటు పొందవచ్చన్నారు.

బ్రీడర్ విత్తనం :

ఇది అన్ని రకాల విత్తనాలకు మూల విత్తనం. దీన్ని కంపెనీలు ఆయా బ్రీడర్ల పర్యవేక్షణలో పండిస్తారు. వ్యవసాయ పరిశోధన స్థానాల్లో శాస్త్రవేత్తలు తయారు చేసేది ఇలాంటి విత్తనాలే. ఈ విత్తనం వంద శాతం జన్యు నాణ్యత కలిగి ఉంటుంది. బ్రీడర్ సీడ్‌కు బంగారు రంగు ట్యాగ్ వేస్తారు. సీడ్ ధర ఎక్కువ. రైతులకు రెండు కిలోలకు మించి ఇవ్వరు.

ఫౌండేషన్ విత్తనం :

ఈ విత్తనాన్ని బ్రీడర్ విత్తనం నుంచి ఉత్పత్తి చేస్తారు. వివిధ విత్తనోత్పత్తి సంస్థలు, సాంకేతిక నిపుణుల అధ్వర్యంలో వీటిని పండిస్తారు. దాదాపు వంద శాతం జన్యు నాణ్యత ఉంటుంది. ప్రైవేటు విత్తన కంపెనీలు వ్యవసాయ పరిశోధన సంస్థల నుంచి బ్రీడర్ విత్తనాలు తీసుకెళ్లి ఫౌండేషన్ విత్తనాన్ని తయారు చేస్తాయి. ఈ సీడ్‌కు తెలుపు రంగు ట్యాగ్ వేస్తారు.

సర్టిఫైడ్ (ధ్రువీకరించిన) విత్తనం :

దీన్ని ఫౌండేషన్ విత్తనం నుంచి వేరుగా ఉత్పత్తి చేస్తారు. వివిధ సంస్థలు, రైతుల పొలాల్లో విత్తన పర్యవేక్షకుల సమక్షంలో వీటిని తయారు చేస్తారు. ఈ విత్తనానికి నీలి రంగు ట్యాగ్ వేస్తారు.

లేబుల్ ట్యాగ్‌పై ఉండే వివరాలు :

విత్తన పరీక్ష చేసిన తేదీ, ఆ తేదీ నుంచి 9 నెలల కాల పరిమితిలోపు విత్తనాన్ని కొనుగోలు చేయవచ్చు.

వీటిని గమనించడం మేలు :

- విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు కనీస మొలక శాతం, కనీస జన్యు స్వచ్ఛత, గరిష్ట తేమ శాతం తదితర వివరాలు చూసుకున్న తర్వాతనే కొనుగోలు చేయాలి.
- విత్తన సంచిపై లేబుల్ లేకున్నా, సరిగ్గా సీల్ లేకున్నా, విత్తనాలు కొనకపోవడం మంచిది.
- తేమ అధికంగా ఉన్న చోట, మిర్చి విత్తనాల దగ్గర, సిమెంట్, క్రిమి సంహారక మందులు, ఎరువుల సంచుల వద్ద, సూర్యరశ్మి తగిలే ప్రాంతాల్లో నిల్వ చేసిన విత్తనాలు కొనుగోలు చేయవద్దు.
- అడ్వాన్స్‌గా విత్తనాలు బుకింగ్ చేయకపోవడం ఉత్తమం.
- రాత్రికి రాత్రి విక్రయించే అపరిచిత వ్యక్తుల నుంచి విత్తనాలు కొనుగోలు చేయొద్దు. అనుమానం వస్తే ఆయా వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలి.

ట్రూత్ ఫూల్ లేబుల్ విత్తనం :

సర్టిఫైడ్ విత్తనం నుంచి ఉత్పత్తి చేసిన ఈ విత్తనాన్ని విత్తన ధ్రువీకరణ సంస్థ ధృవీకరించాల్సి ఉంటుంది. అనంతరం ఆ విత్తనాలను ట్రూత్ ఫూల్ లేబుల్ కింద రైతులకు విక్రయిస్తారు. ట్రూత్ ఫూల్ లేబుల్ విత్తనానికి ఆకుపచ్చ రంగు ట్యాగ్ వేస్తారు.